
జ్ఞాపక'శక్తి' పోతోంది

- పెరుగుతున్న మతిమరుపు జబ్బు
- ఐదేళ్లలో ఐదు శాతం పెరిగిన బాధితులు
- జిల్లాలో 10 శాతం దాకా బాధితులు
- మానసిక ఒత్తిడి, ఆందోళనలే కారణం
- స్మార్ట్ ఫోన్ల అతివాడకం కూడా కారణం
- చిన్నచిన్న విషయాలు మర్చిపోతున్న వైనం



•కర్నూలు నగరంలోని పాతబస్టాండ్‌కు చెందిన చంద్రశేఖర్ ఓ ప్రైవేటు సంస్థలో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. ప్రతిరోజూ తాను ఎవరిని కలవాలి, ఎవరికి ఫోన్ చేయాలి వంటి విషయాలన్నీ బాగా గుర్తుండేవి. ఒకప్పుడు ఫలానా వ్యక్తి ఫోన్ నంబర్ ఎంత అని అడిగితే సెల్‌ఫోన్ చూడకుండానే టకీమని చెప్పేవాడు. ఇలా దాదాపు ఐదారు వందలకు పైగా ఫోన్ నంబర్లు అతని మెదడులో నిక్షిప్తమై ఉండేవి. స్మార్ట్‌ఫోన్‌పై ఎక్కువగా ఆధారపడ్డాక ఇప్పుడు ఇంటి ఫోన్ నంబర్ చెప్పాలన్నా ఫోన్ చూడక తప్పడం లేదు.

కర్నూలు(హాస్పిటల్): సాధారణంగా వృద్ధాప్యంలో మతిమరుపు వస్తుంది. దానిని వైద్యపరిభాషలో అల్జీమర్స్ అంటారు. 60 నుంచి ప్రతి పదేళ్లకు ఒక స్టేజి మారుతూ తీవ్రత పెరుగుతుంది. ఇది వృద్ధుల్లో 10 నుంచి 20 శాతం మందికి ఉండే సమస్య. కానీ ఇటీవల యువతలోనూ మతిమరుపు సమస్య వస్తోంది. చదువుతో పాటు ఉద్యోగంలో తీవ్ర మానసిక ఒత్తిడి, మానసిక ఆందోళన పనిపై ఏకాగ్రత్తను దెబ్బతీస్తోంది. దీనికితోడు స్మార్ట్‌ఫోన్ వచ్చాక మెదడులో ఉన్న జ్ఞాపక'శక్తి' కోల్పోతోంది. ఈ క్రమంలో పూర్వం లాగా మెదడుకు మళ్లీ వ్యాయామం చేయించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మతిమరుపు సమస్యతో 10 శాతం వరకు సాధారణ ప్రజలు బాధపడుతున్నారు. ఇందులో వృద్ధుల శాతం 15 నుంచి 20 శాతం వరకు ఉంటోంది. కర్నూలు నగరంలోని మానసిక వైద్యులు, న్యూరాలజిస్టుల వద్దకు వివిధ రకాల సమస్యలతో వస్తున్న వారిలో ప్రధానంగా జ్ఞాపకశక్తి సమస్య కూడా ఉంటోంది. ఆయా వ్యాధి లక్షణాలతో పాటు తమకు ఈ మధ్య సరిగ్గా గుర్తుండటం లేదని వైద్యులకు రోగులు చెబుతున్నారు. కోవిడ్-19 పరిస్థితుల్లో తీసుకున్న మందులు, వైరస్ కారకాల కారణంగా జ్ఞాపకశక్తి మరింత తగ్గిపోయిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

సొంతంగా ఆలోచించడం మానేశారు

ఏదైనా పదానికి అర్థం తెలియాలంటే తెలిసిన వారిని, పెద్దలనో అడిగే వారు. లేదా డిక్షనరీ, తెలుగు నిఘంటువులలో వెతికేవారు. కానీ ఇప్పుడు ఏ చిన్న పదం తెలియకపోయినా వెంటనే సెల్‌ఫోన్‌లోని గూగుల్‌లో వెతికేస్తున్నారు. అలాగే ఏదైనా లెక్క చెబితే పెన్ను పేపర్ తీసుకుని సాధన చేసి సమస్య పరిష్కరించేవారు. కానీ ఇప్పుడు వెంటనే కాలుక్యులేటర్‌ను ఉపయోగిస్తున్నారు. ఏ పదానికి అర్థం కావాలన్నా, ఏ చిన్న సమస్యకు పరిష్కారం కావాలన్నా, ఏదైనా ఒక విషయం గురించి తెలుసుకోవాలన్నా వెంటనే గూగుల్‌లో వెతికితే క్షణాల్లో సమాధానం లభిస్తోంది. ఇక దీనివల్ల సమయం ఆదా అవుతున్నా ఆలోచించే గుణం లోపిస్తోంది. కాగా ఇటీవల చాట్-జీపీటీ వచ్చిన తర్వాత సమాధానాలే అందులో వస్తున్నాయి. ఇది మనిషి మెదడును పూర్తిగా తినేస్తుందని నిపుణులు ఆందోళన చెందుతున్నారు.

మతిమరుపునకు కారణాలు

పది మంది కలిసి మనసు విప్పి మాట్లాడుకోకపోవడం, గుంబనంగా ఉండటం, వ్యక్తులకు దూరంగా ఉండటం, ప్రతి విషయానికీ సోషల్ మీడియాపై ఆధారపడటం, ఏ పని చేయాలన్నా ఆందోళన చెందడం, హడావుడి పెరగడంతో తీవ్ర ఒత్తిడికి గురి కావడం వంటి కారణాలతో మతిమరుపు బాధితుల సంఖ్య పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. దీనికితోడు పనిఒత్తిడి, కుటుంబ సమస్యలు, ఆర్థికాంశాలు కూడా మతిమరుపునకు కారణమవుతున్నాయి.

అనుబంధాలు దూరం

స్మార్ట్‌ఫోన్ వినియోగంలోకి వచ్చాక సామాజిక బంధాలూ దూరమవుతున్నాయి. పేరుకు వివాహాది శుభకార్యాల్లో అందరూ కలుస్తున్నా మాట వరసకు పలకరించుకుని ఆ తర్వాత ఎవరి స్మార్ట్‌ఫోన్‌లో వారు బిజీగా ఉండి పోతున్నారు. ఎదురుగా మనిషి మాట్లాడుతున్నా వింటున్నట్లే నటిస్తూ స్మార్ట్‌ఫోన్‌లో బిజీగా గడుపుతుండటం మనం నిత్యం గమనిస్తుంటాము. అలాగే ఎవరి ఇంటికి వెళ్లినా, ఎవ్వరైనా ఇంటికి వచ్చినా ఇదే పరిస్థితి నెలకొంది. దీనివల్ల మనుషుల మధ్య అనుబంధాలు దూరమవుతున్నాయి. ఒక బస్సుల్లో పేపర్ చదివే ప్రయాణికులు లేరు. 98 శాతం మంది స్మార్ట్‌ఫోన్ చూస్తూ పక్కనున్న వారిని కూడా పలకరించని పరిస్థితి.

మత్తుపదార్థాలతో పెనుముప్పు

మత్తుపదార్థాలను వాడటం వల్ల కూడా మెదడు మొద్దుబారి పోయి మతిమరుపునకు కారణం అవుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కల్లుతాగే వారిలో మతిమరుపు సమస్య అధికమవుతోందని వైద్యులు గుర్తించారు. ఇందులో మత్తు కోసం క్లోరల్ హైడ్రేట్, ఆల్ప్రాజోలమ్ వంటి కెమికల్స్ కలుపుతున్నారు. దీన్ని తాగిన వారు త్వరగా మత్తుకు బానిస అవుతున్నారు. దీంతో పాటు చీప్ లిక్కర్, పరిమితికి మించి ఆల్కహాలు తాగేవారు, చైన్‌స్మోకర్లలోనూ మతిమరుపు సమస్య ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు.

మతిమరుపునకు ఇలా చెక్‌పెట్టొచ్చు

- పుస్తకపఠనం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది.
- నిత్యం కెరీర్ గోల్స్‌ను లక్ష్యంగా ఉంచుకోవాలి. ఇందుకోసం రోజు, వారం, నెలవారీగా ప్రణాళికలు రూపొందించుకోవాలి.
- శారీరక వ్యాయామం, మంచి ఆలోచనలు, మంచి ఆహారపు అలవాట్లు, ఇతరులతో మమేకం కావడం, కబుర్లు చెప్పుకోవడం చేయాలి.
- మెదడుకు పనిచెప్పే చదరంగం, పజిల్స్ పూరించడం, సుడోకో, పదవిన్యాసం, పద వినోదం చేయాలి.
- యోగా, ధ్యానం చేయాలి.
- సంగీతం, నృత్యం, చిత్రలేఖనం అభిరుచిగా ఎంచుకోవాలి.

కోవిడ్ తర్వాత పెరిగిన మతిమరుపు



పోస్టు కోవిడ్ తర్వాత మతిమరుపు బాధితుల సంఖ్య బాగా పెరిగింది. గతంతో పోలిస్తే 5 శాతం మంది బాధితులు పెరిగారు. వైరస్ కారణంగా మెదడులో అనేక మార్పులు జరగడం వల్ల ఈ పరిస్థితి సంభవించింది. ప్రస్తుతం 40 ఏళ్లలోపు వారిలోనూ మతిమరుపు సమస్యలతో బాధపడుతున్నారు. దీంతో పాటు బీపీ, షుగర్ దీర్ఘకాలంగా అదుపులో లేకపోయినా నరాల్లో మార్పులు జరిగి మతిమరుపునకు కారణం అవుతుంది. కాబట్టి ఎప్పుడూ బీపీ, షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవాలి.

– డాక్టర్ కె. నాగిరెడ్డి, మానసిక వైద్యనిపుణులు, కర్నూలు

పెద్దల్లో మతిమరుపు పట్ల జాగ్రత్త



అల్జీమర్స్ వయస్సు మీదపడే కొద్దీ సమస్య ఎక్కువవుతుంది. దీనివల్ల వృద్ధాప్యంలో ఇబ్బందులు పడుతుంటారు. దీనికి మధుమేహం, రక్తపోటు, పక్షవాతం, పొగ, మత్తుపానియాలు తాగడం, తలకు గాయాలు కావడం, జన్యుపరమైన మార్పులు, విటమిన్-బి12, విటమిన్-డి లోపం, థైరాయిడ్ సమస్యలు, నిద్రలేమి కూడా మతిమరుపునకు దోహదం చేస్తాయి. దీర్ఘకాలిక వ్యాధులను అదుపులో ఉంచుకోవడం, వ్యాయామం, ఒత్తిడి తగ్గించేందుకు యోగా, ధ్యానం, మంచి ఆహారపు అలవాట్లుతో నివారించవచ్చు.

– డాక్టర్ ఎం.నాగసురేష్, న్యూరాలజిస్టు, కర్నూలు

మారిన విద్యుత్ రూరల్స్ ఈఈ సెల్ నంబర్

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాసు బాబు సెల్ ఫోన్ నంబర్ మారింది. సాంకేతిక సమస్య కారణంగా గతంలో ఉన్న నంబర్ స్థానంలో కొత్తగా 91549 53788 నంబర్‌ను అధికారికంగా కేటాయించినట్లు కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి పేర్కొన్నారు. కర్నూలు రూరల్స్ డివిజన్ పరిధిలోని గూడూరు, సి.బెళగల్, కోడుమూరు, నందికొట్కూరు, మిడ్తూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా, పాములపాడు, ఆత్మకూరు, శ్రీశైలం మండలాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి, అవసరమైన సందర్భాల్లో ఫోన్ చేసి పరిష్కారం పొందవచ్చని వెల్లడించారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



రైల్వే యార్డులో మురుగునీరు చేరిన దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని వైఎస్‌ఆర్ 43వ వార్డు ఇల్లూరు నగర్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని వార్డు ప్రజల సంక్షేమ సంఘం కన్వీనర్, రిటైర్డు లేబర్ ఆఫీసర్ వై. వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కాలనీలో నెలకొన్న సమస్యపై మీడియా దృష్టికి తీసుకొచ్చారు. ఇల్లూరు నగర్‌లోని డ్రైనేజీ, వర్షపు నీరు ఏళ్లతరబడి ఇందిరాగాంధీ నగర్, రైల్వే యార్డు మీదుగా మున్సిపల్ కార్పొరేషన్ డ్రైనేజీలో కలిసేదన్నారు. కొంతరు డ్రైనేజీ నీరు వెళ్లకుండా కొంత కాలం క్రితం గోడ కట్టారని, దీంతో సమస్య ఏర్పడిందని తెలిపారు. మరోవైపు ఈ సమస్యను పరిష్కరించాలని ఏళ్ల తరబడి మున్సిపల్, రైల్వే అధికారులను విన్నవిస్తున్నా స్పందించడం లేదన్నారు. రెండు శాఖ మధ్య సమన్వయ లోపంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

క్లుప్తంగా

క్రీడలతో ఆరోగ్యం



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో పాణ్యం ఎమ్మెల్యే రాంభూపాల్ రెడ్డి

కర్నూలు(రూరల్): విద్యార్థులు చదువుతో పాటు ప్రతిరోజు ఆటలు ఆడడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని ప్రజాశక్తి కార్యాలయం ఎదురుగా ఉన్న పార్క్ ఆవరణంలో తైక్వాండో వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో కాటసాని రాంభూపాల్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ మహబూబ్‌బాషా హాజరై ప్రశంసా పత్రాలు, అందజేశారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకున్న విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో శిక్షకులు లలిత కీర్తన, రోహిత్, షబ్బీర్, నరసింహ, కపిల్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ లస్కర్ మృతి



శ్రీరాములు(ఫైల్)

కర్నూలు సిటీ: శ్రీశైలం ప్రాజెక్టు నీటి ముంపు నిర్వాసితుడిగా జల వనరుల శాఖ కర్నూలు ప్రాజెక్టు సీఈ కార్యాలయంలో అటెండర్ ఉద్యోగం చేస్తున్న లస్కర్ శ్రీరాములు అనారోగ్యంతో మృతి చెందాడు. ఇతడిది జూపాడుబంగ్లా మండలం తుమ్మలూరు గ్రామం. విషయం తెలిసిన వెంటనే సీఈ కార్యాలయం సూపరింటెండెంట్ కమలాకర్, ఎన్‌టీపీపీ జిలానీ, స్టెనో వెంకటేశ్వర్లు తదితరులు శ్రీరాములు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సూపరింటెండెంట్ రూ.10 వేలు, లస్కర్ సంఘం తరపున రూ.12,500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

క్రీడల్లో రాణించాలి



విద్యార్థులు బ్యాగులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర శర్మ

కర్నూలు(రూరల్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా ఉషా సంఘం చైర్మన్ డాక్టర్ శంకరశర్మ సూచించారు. నగరంలోని పెద్ద మార్కెట్ బాలికల పాఠశాలలో ఆదివారం ఉషా క్రీడా వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శంకరశర్మ మాట్లడుతూ ప్రతి రోజు ఆటలు ఆడడం ద్వారా శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు బ్యాగులు, ప్రశంసా పత్రాలు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శిక్షకుడు శ్రీనివాసులు, అమృతేశ్వర్, చిరంజీవి, క్రాంతి కుమార్, చిన్న శ్రీనివాసులు పాల్గొన్నారు.

పూలసాగును ప్రోత్సహించండి



ఇన్‌పుట్ డీలర్లకు మూల్యాంకనం నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటలైన పూల సాగులో రైతులు రాణించే విధంగా అవగాహన కల్పించాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వై.మౌనిక ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాలులో దేశీ డిప్లొమా కోర్సులో భాగంగా ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లె, లిల్లీ, కనకాంబరం, చామంతి తదితర పూల సాగు యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దేశీ డిప్లొమా కోర్సు సమన్వయకర్త, విశ్రాంత డీడీఏ నాగేంద్రయ్య, శాస్త్రవేత్త చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తైక్వాండోలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

కర్నూలు(రూరల్): విద్యార్థులు తైక్వాండోలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని క్రీడా శాఖ సీఈఓ రమణ తెలిపారు. ఆదివారం నగరంలోని పెద్ద మార్కెట్ కేఎంసీ పార్క్ ఆవరణంలో తైక్వాండో వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం ఆయన మాట్లాడారు. తైక్వాండో క్రీడకు మంచి గుర్తింపు ఉందని, ప్రతి రోజు సాధన చేయడం ద్వారా ఆటల్లో మెలకువలు నేర్చుకోవచ్చన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శిక్షకుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు



దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు

కర్నూలు(సెంట్రల్): తూకాల్లో మోసాలకు పాల్పడినా..నాన్ స్టాండర్డ్ వెయిట్స్‌ను వాడినా కఠిన చర్యలు తప్పవని లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాముడు వ్యాపారులను హెచ్చరించారు. తూకాల్లో జరుగుతున్న మోసాలపై 'కొలత తప్పుతోంది' శీర్షికన ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జాయింట్ కంట్రోలర్ ఎం.గోపికృష్ణారెడ్డి ఆదేశాల మేరకు అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాముడు, ఇన్‌స్పెక్టర్ ఎం.పరమేశ్వరకుమార్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నగరంలోని సీక్యాంపు రైతుబజార్ చుట్టూ ఉన్న పలు పండ్లు, కూరగాయల వ్యాపారుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఒక ఫ్రూట్ షాపులో 100 గ్రాముల బరువు తక్కువగా ఉండడంతో కేసు నమోదు చేశారు. ముద్రలేని..నాన్ స్టాండర్డ్ వెయిట్స్ వాడుతున్న మరో 3 షాపులపై కేసులు నమోదు చేసి రూ.6,400 అపరాధ రుసుం విధించినట్లు శ్రీరాముడు తెలిపారు.

తప్పిపోయిన పిల్లలు తల్లిదండ్రుల చెంతకు



తప్పిపోయిన పిల్లలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

కర్నూలు: నగరంలోని బుధవారపేట అభయారణ్య స్వామి దేవాలయం పక్కన నివాసం ఉంటున్న ఉరుకుంద, వీణా దంపతుల కుమార్తెలు మంజూషా (6) శాలినీ (5) ఆదివారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటూ తప్పిపోయారు. తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి వెంటనే స్పందించి ప్రత్యేక టీమ్‌లను రంగంలోకి దింపారు. పోలీసు వాట్సాప్ గ్రూపుల్లో అమ్మాయిల ఫొటోలను పంపించి గంట వ్యవధిలోనే ఆచూకీ కనుగొని తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. చిన్నారులు కొండారెడ్డి బురుజు నుంచి పాతబస్టాండ్ వైపుకు వెళుతుండగా పోలీసు వాట్సాప్ గ్రూపుల్లో ఉన్న ఫొటోలను గుర్తించి స్థానిక జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఉన్న పోలీసులకు అప్పగించారు. డీపీఓ నుంచి మూడో పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి వెళ్లి పిల్లలను అదుపులోకి స్టేషన్‌కు తరలించి తల్లిదండ్రులకు అప్పగించారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని పేదలకు లయన్స్ ఇంటర్నేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌ఆర్ హాస్పిటల్ వద్ద ఆదివారం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎంజేఎఫ్ జె.రామచంద్రప్రకాష్, లయన్స్ క్లబ్ సెక్రటరీ దామెర ప్రభాకర్, రాయపాటి శ్రీనివాస్, సభ్యులు డాక్టర్ బాలమద్దయ్య, రత్నప్రసాద్, శివరామ్‌గౌడ్, విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

16న బీసీ సామాజిక చైతన్య సభ



ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గోపి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 16న బీసీ సామాజిక చైతన్య సభను నిర్వహిస్తున్నట్లు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గోపి శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. ఆదివారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీలకు చేస్తున్న మోసాన్ని ఎండ గట్టడం, నిద్రపోతున్న ప్రభుత్వాన్ని నిద్రలేపేందుకు ఓబీసీ మోర్చా పలు కార్యక్రమాలు చేపడుతుందన్నారు. నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం 9 ఏళ్లలో బీసీల అభివృద్ధిని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బీసీ లకు వివరించేందుకు సభ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో ఏడు జిల్లాల బీసీల నాయకులు, కుల సంఘాల నాయకులను ఆహ్వానిస్తున్నామన్నారు. 16వ తేదీ సాయంత్రం 3 గంటలకు ఆదోనిలో సభ జరుగుతుందన్నారు. ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్య సభ సభ్యులు లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు పాల్గొంటారన్నారు. ఓబీసీ జాతీయ కార్యదర్శి డాక్టర్ పార్థసారథి వాల్మీకి మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 9 ఏళ్ల కాలంలో అందించిన సుపరిపాలన, బీసీల అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. బీజేపీ ప్రభుత్వం హయాంలో 75 కోట్ల బీసీలు సంతృప్తి కరంగా ఉన్నారన్నారు. కర్నూలు పార్లమెంట్ పరిధిలో బీసీ సామాజిక వర్గాలు అధికంగా ఉండటంతో ఇక్కడ సభ నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రమౌళి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాళింగి నరసింహ వర్మ, ఓబీసీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి మురళి నాయుడు, జిల్లా అధ్యక్షులు మలేకర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏపీఆర్‌జేసీ డీసీ సెట్ కౌన్సెలింగ్

ఎమ్మిగనూరురూరల్: కర్నూలులోని సంతోష్‌నగర్ ఈద్గా వద్ద ఉన్న ఏపీ రెసిడెన్సియల్ (మైనార్టీ బాయ్స్) పాఠశాలలో ఏపీఆర్‌జేసీ డీసీ సెట్ కౌన్సెలింగ్ సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఏపీఆర్‌జేసీ సెట్ జిల్లా కన్వీనర్ డాక్టర్ జయం శ్రీనివాసగుప్త ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి విడత కౌన్సెలింగ్‌కు ఎంపికైన విద్యార్థులు https//aprs.apcfss.in వెబ్‌లింక్ ద్వారా మెమో డౌన్‌లోడ్ చేసుకుని అందులో సూచించిన విధంగా సర్టిఫికెట్లు, ఫీజుతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. 12న ఎంపీసీ, ఈఈటీ, 13న బైపీసీ, సీజీడీఎం, 14న ఎంఈసీ, సీఈసీ కోర్సులకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. 10వ తరగతిలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 50 శాతం, ఓసీ, బీసీ విద్యార్థులు 60 శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు.

శ్రమదానం

కర్నూలు(అర్బన్): నగరంలోని బీ క్యాంప్ సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గృహంలో శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రం చేసినట్లు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ) జిల్లా కోఆర్డినేటర్ వేల్పుల జ్యోతి చెప్పారు. వసతి గృహం పరిసరాలన్నీ కంపచెట్లతో నిండిపోయి ఉండటంతో తొలగించామని, డ్రైనేజీ, మంచినీటి పైపులను శుభ్రం చేశామని చెప్పారు.

పాలీసెట్‌పై అవగాహన తరగతులు

కర్నూలు సిటీ: పాలీసెట్-2023 ప్రవేశ పరీక్ష రాసి రిజిస్టర్ చేసుకుని, సర్టిఫికెట్ల వెరిఫై చేయించుకున్న విద్యార్థులకు నేటి నుంచి 24వ తేదీ వరకు అవగాహన తరగతులు నిర్వహించనున్నట్లు ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎంవీఎస్ఎస్ఎన్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బి.తాండ్రపాడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో తరగతులు నిర్వహించనున్నామని, ఆసక్తి ఉన్నటువంటి విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు.

మొబైల్ క్యాంటీన్ నిర్వాహకుడిపై కేసు నమోదు

కర్నూలు: నంద్యాల చెక్‌పోస్టు వద్ద మొబైల్ క్యాంటీన్ నిర్వాహకుడు రాముపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం రాత్రి 11 గంటల తరువాత హోటల్ నిర్వహిస్తుండటంతో గస్తీలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ ఆనందం మూసేయాలని సూచించినప్పటికీ లెక్క చేయకుండా వ్యాపారం నడుపుతుండటంతో మరోసారి హెడ్ కానిస్టేబుల్ గట్టిగా మందలించడంతో ఇరువురి మధ్య గొడవ జరిగింది. దీంతో తన విధులకు ఆటంకం కలిగించడమే గాక శాంతి భద్రతలకు విఘాతం కలిగించాడని ఆనందం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

'స్పందన' సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు (న్యూటౌన్): స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్పందన కార్యక్రమానికి మండల అధికారులు తప్పకుండా హాజరు కావాలని సూచించారు.

బదిలీ పండిట్లను రిలీవ్ చేయాలి

కర్నూలు సిటీ: బదిలీ అయిన బాషా పండిట్లను వెంటనే రిలీవ్ చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు కోరారు. ఆదివారం డీఈఓ రంగారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హృదయరాజు మాట్లాడుతూ బదిలీ అయిన హిందీ, తెలుగు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లను ప్రత్యామ్నాయంతో నిమిత్తం లేకుండా రిలీవ్ చేయాలన్నారు. స్కూల్ అసిస్టెంట్స్, ఎస్‌జీటీల విషయంలో ఇద్దరు ఉన్నచోట ఒకరిని, నలుగురు ఉన్న చోట ఇద్దరిని రిలీవ్ చేయాలని ఉత్తర్వులు 47 నిబంధన15లో ఉందన్నారు. పండింట్స్, పీడీల విషయంలో ఖాళీలను బ్లాక్ చేయడంతో ఉన్న పాఠశాలలను వెబ్ ఆప్షన్స్ ద్వారా ఎన్నుకోవడం జరిగిందన్నారు. వీరికి కూడా ప్రత్యామ్నాయం ఉంటేనే రిలీవ్ చేస్తామని ఎంఈఓలు, హెచ్‌ఎంలు కట్టడి చేస్తున్నారన్నారు. పోస్టులు పదోన్నతుల ద్వారా భర్తీకాకపోవడం కోర్టు కేసు పెండింగ్ ఉండడం వల్ల ప్రత్యామ్నాయం ఉండదన్నారు. బదిలీ అయిన టీచర్లందరిని ప్రత్యామ్నాయంతో సంబంధం లేకుండా రిలీవ్ చేయాలని డీఈఓను కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

అమిత్‌షా గో బ్యాక్

- ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలను నెరవేర్చిన తరువాత అడుగుపెట్టాలి
- వామపక్షాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన



కలెక్టరేట్ ఎదుట గోబ్యాక్ అమిత్‌షా అంటూ నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్షాలు

కర్నూలు(సెంట్రల్) : కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించేందుకు నైతిక హక్కు లేదని వామపక్షాలు పేర్కొన్నాయి. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలను నెరవేర్చే వరకు ఏపీలో అడుగుపెట్టవద్దని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో గోబ్యాక్ అమిత్‌షా అంటూ కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సీపీఎం ఓల్డ్‌సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు పీఎస్ రాధాకృష్ణ, సీపీఐ నగర సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకులు నరసింహులు, వెంకటేశ్వర్లు మాట్లాడారు. విశాఖ ఉక్కును ప్రైవేట్ పరంచేస్తామని చెబుతూ ఏ ముఖం పెట్టుకుని పర్యటనకు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కేవీ నారాయణ, టి.రాముడు, సీపీఐ నాయకులు నాగరాజు, ఈశ్వర్ పాల్గొన్నారు.

తెలుగు సినీ రంగంలో ఆణిముత్యం సినారే



సినారే చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: తెలుగు సాహిత్యంలో, సినిమా రంగంలో సి.నారాయణరెడ్డి తన దైన శైలితో ప్రత్యేక స్థానాన్ని సంపాదించారని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం టీజీవీ కళాక్షేత్రంలో సినారే వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అభ్యుదయ కవిగా సినారేకు లలిత సాహిత్యంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. అనంతరం శ్రీనివాసులు బృందం సినారే పాటల సంగీత విభావరి నిర్వహించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సీవీ రెడ్డి, గాయకులు సుధారాణి, నాగశేషన్న తదితరులు పాల్గొన్నారు.

దాతృత్వ గుణం కలిగి ఉండాలి



ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులు

కర్నూలు కల్చరల్: ఆధ్యాత్మిక చింతనతోపాటు దాతృత్వ గుణం కలిగి ఉండాలని ఇస్కాన్ కర్నూలు బాధ్యులు రామకృష్ణ చైతన్య ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణా తరగతులు నిర్వహించారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన సందేశమిస్తూ భగవద్గీత పఠనం చేయాలన్నారు. హరే రామ హరే కృష్ణ జప యజ్ఞంలో భాగస్వాములు కావాలన్నారు.

భక్తిశ్రద్ధలతో అనఘాష్టమి వ్రతాలు



అనఘాష్టమి వ్రతాల్లో భక్తులు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయం ఆవరణలోని దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అనఘాష్టమిని పురస్కరించుకుని అనఘా దేవి సమేత అనఘా స్వామికి అనఘాష్టమి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

కళలను కాపాడుకోవాలి

- ముగిసిన కూచిపూడి వర్క్‌షాప్



నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు



కూచిపూడి నాట్య గురువులతో వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

కర్నూలు కల్చరల్: భారతీయ కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కూచిపూడి సిద్ధేంద్ర కళా పీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి అన్నారు. భారత కళ గ్రామ, నాట్య వేద కళా నిలయం సంయుక్త ఆధ్వర్యంలో కర్నూలు బుధవార పేటలోని కేశవ మెమోరియల్ పాఠశాలలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న కూచిపూడి వర్క్‌షాప్ ఆదివారంమ ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలులో మొదటిసారి ఏర్పాటు చేసిన అభ్యసన శాలకు మంచి స్పందన వచ్చిందన్నారు. రాబోయే కాలంలో కర్నూలు నగరం కూచిపూడి నృత్య విద్యార్థులకు నిలయంగా ఉంటుందన్నారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార్ అవార్డు గ్రహీత, జెంగళూరు బంగార్ పేట భరత కళ గ్రామ ప్రెసిడెంట్ డాక్టర్ వసంత్ కిరణ్ మాట్లాడుతూ లయ, శృతి, జ్ఞానంపై శిక్షణ ఇచ్చామన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కర్నూలులో శాస్త్రీయ నృత్యం వర్క్‌షాప్ నిర్వహించడం అభినందనీయం అన్నారు. టీజీవీ కళాక్షేత్రం కళాకారులకు అండగా నిలుస్తుందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో నిర్వాహకులు కె.తేజేశ్వర్, కూచిపూడి నృత్య శిక్షకులు సాయి ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.